కలుషిత నీటి సమస్య పరిష్కారం


నీటి కాలుష్యాన్ని పరిశీలిస్తున్న కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్ యాదవ్

కాచిగూడ: చెప్పల్‌బజార్‌లో గత కొద్ది రోజులుగా మంచినీటి నల్లాల ద్వారా కలుషిత నీటి సరఫరా జరుగుతుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సమస్యను పరిష్కరించాలని అనేసార్లు అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. సమస్యను గురువారం కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్ యాదవ్ దృష్టికి తీసుకువెళ్లడంతో ఆమె స్పందించి జలమండలి అధికారులతో కలిసి నీరు కలుషితమవుతున్న ప్రాంతాన్ని గుర్తించి సమస్య పరిష్కారానికి కృషి చేశారు. కార్యక్రమంలో జలమండలి డీజీఎం సన్యాసిరావు, ఏఈ భావన, విజయ్, మల్లికార్జున్, సూరి, సంతోష్, రవియాదవ్ తదితరులు పాల్గొన్నారు.

వాకింగ్ ట్రాక్‌ను వెంటనే పునరుద్ధరించండి


వర్షపు నీటితో నిండిపోయిన వాకింగ్ ట్రాక్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: సుందరయ్య పార్కులో ఇటీవల కురుస్తున్న వర్షానికి ఛిద్రమైన వాకింగ్ ట్రాక్‌ను వెంటనే పునరుద్ధరించాలని కోరుతూ సంబంధిత జీహెచ్‌ఎంసీ అధికారులకు వినతిపత్రం సమర్పించినట్లు హైదరాబాద్ జిందాబాద్ ప్రధాన కార్యదర్శి కె.వీరయ్య తెలిపారు. మే 16 కురిసిన వర్షంతో వాకింగ్ ట్రాక్ నిండిపోయి ఛిద్రమైన విషయాన్ని అధికారులకు ఫిర్యాదు చేశామన్నారు. మరోవైపు వాకింగ్ ట్రాక్ పక్కనే ఉన్న ఇంకుడు గుంతలో చుక్క నీరు లేకుండా నిరుపయోగంగా ఉందని వర్షం వచ్చిన ప్రతిసారి పార్కు, వాకింగ్ ట్రాక్ నీటితో నిండిపోతుందని తెలిపారు. అధికారులు ఇంకుడు గుంతను నిర్లక్ష్యంగా వదిలి వేయడమే ఇందుకు కారణమని ఆయన ఆరోపించారు. సమస్యను పరిష్కరించాలని కోరారు.

నిరుపేదలకు సేవ చేసేందుకే పూసస్వామి చారిటబుల్ ట్రస్ట్


అన్నదానం చేస్తున్న పూసస్వామి ట్రస్ట్ ప్రతినిధులు

కవాడిగూడ: నిరుపేద ప్రజలను ఆదుకునేందుకు పూసస్వామి చారిటబుల్ ట్రస్ట్ కృషిచేస్తుందని ట్రస్ట్ సభ్యులు బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యులు, ముషీరాబాద్ కంటెస్టెడ్ ఎమ్మెల్యే పూసరాజు అన్నారు. అమావాస్యను పురస్కరించుకుని గురువారం లోయర్ ట్యాంక్‌బండ్‌లోని గోషాలలో ఉన్న లక్ష్మి దేవి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పూసస్వామి ట్రస్ట్ ఆధ్వర్యంలో గోషాల వద్ద నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పూసస్వామి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిరుపేదలను ఆదుకునేందుకు వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుందన్నారు. ప్రతి నెలలో అమావాస్య రోజున తన తండ్రి పేరున సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ ప్రతినిధులు సునంద, మణికాంత్, యశశ్వీకాంత్, వందన, దివ్య తదితరులు పాల్గొన్నారు.

ధారణా శిబిరంతో జ్ఞాపకశక్తి పెంపు


చిన్నారులకు లస్సీ పంపిణీ చేస్తున్న కట్టెల సుభాష్, తదితరులు

నల్లకుంట: చిన్నారుల్లో జ్ఞాపక శక్తి, మేధా శక్తిని పెంపొందించేందుకు నల్లకుంట శంకరమఠంలో నిర్వహిస్తున్న 'ఉచిత ధారణా(జ్ఞాపక శక్తి) శిక్షణ శిబిరం' దోహదపడుతుందని టీపీసీసీ ఓబీసీ విభాగం వైస్ చైర్మన్ కట్టెల సుభాష్ అన్నారు. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఎస్.హరినాథ్ రెడ్డి ఆధ్వర్యంలో గురువారం నల్లకుంట శంకరమఠంలో సువర్ణ భారతి మహోత్సవంలో భాగంగా నిర్వహిస్తున్న ధారణా శిబిరంలో శిక్షణ పొందుతున్న చిన్నారులకు లస్సీ పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వేసవి సెలవుల్లో చిన్నారుల మేధో శక్తిని పెంపొందించే శిక్షణా శిబిరాలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. శిబిరంలో చిన్నారులకు కథలు, భజనలు, రామాయణం, విష్ణు సహస్రనామ స్తోత్రధారణతో పాటు మేధా శక్తిని పెంచే ఆటల్లో శిక్షణ ఇవ్వడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు హరినాథ్ రెడ్డి, శరత్, ఎన్.గిరి, బి. కాంతారావు, కాలేరు శ్రీనివాస్ రావు, ఎడ్ల నరేందర్ రెడ్డి, దేవిరెడ్డి విజితా రెడ్డి, సీహెచ్. మురళీ కృష్ణ, విశ్వేశ్వర్ రావు, శ్రీనివాస్ రెడ్డి, ధారణా శిబిరం నిర్వాహకులు పాల్గొన్నారు.

దళిత సంక్షేమంపై శ్వేతపత్రం విడుదల చేయాలి


మాట్లాడుతున్న మామిడి నారాయణ

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: రాష్ట్రంలో గత పదేళ్ల కాలంలో దళితులకు అందజేసిన సంక్షేమ పథకాలపై ప్రభుత్వం శ్వేత పత్రాన్ని విడుదల చేయాలని సెంటర్ ఫర్ బెటర్ ఇండియా రిసర్చ్ ఫౌండేషన్ డైరెక్టర్ మామిడి నారాయణ డిమాండ్ చేశారు. గురువారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఎస్సీ కులాల సంక్షేమం, పథకాల వాటాలు, వాస్తవాలు అంశంపై రీసర్చ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మామిడి నారాయణ మాట్లాడుతూ పదేళ్లల్లో ఎస్సీ మాల, మాదిగ, ఇతర ఉప కులాలకు ప్రభుత్వం నుంచి అందిన సంక్షేమ పథకాలు, ఎస్సీ కార్పొరేషన్ రుణాలు, దళిత బంధు, మూడు ఎకరాల భూమి తదితర పథకాల వివరాలపై కులాల వారీగా శ్వేత పత్రం విడుదల చేయాలని కోరారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి దశాబ్దం గడిచినా దళితుల పట్ల ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరించడం లేదన్నారు. కార్యక్రమంలో డాక్టర్ మంచాల లింగస్వామి, ప్రొఫెసర్ పట్టా వెంకటేశ్వర్లు, బత్తుల రాం ప్రసాద్, డాక్టర్ నిమ్మబాబురావు, దుబ్బాక నవీన్ తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్స్ డే ఉత్సవాలకు డాక్టర్ సింగం శ్రీనివాస్‌రావుకు ఆహ్వానం


డాక్టర్ సింగం శ్రీనివాస్‌రావును ఆహ్వానిస్తున్న డాక్టర్ ఆదినారాయణ తదితరులు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: మ్యాగ్నిస్ డయాగ్నిస్టిక్ సెంటర్ ఎండీ, ఇండియన్ ప్రజా కాంగ్రెస్ పార్టీ తెలంగాణ వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ సింగం శ్రీనివాసరావుకు వెయ్యి ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించిన సందర్భంగా ఢిల్లీలోని ఆదిలీలా ఫౌండేషన్ ఆధ్వర్యంలో జూలై 1న ఆంధ్ర, తెలంగాణ భవన్‌లో జరిగే అంతర్జాతీయ డాక్టర్స్ డే ఉత్సవాలకు ఆహ్వానం అందింది. ఈ మేరకు గురువారం ఆదిలీలా ఫౌండేషన్ జాతీయ అధ్యక్షులు డాక్టర్ ఆదినారాయణ హైదరాబాద్‌లోని మ్యాగ్నిస్ డయాగ్నస్టిక్ సెంటర్‌ను సందర్శించి డాక్టర్ సింగం శ్రీనివాస్‌రావును సత్కరించడంతో పాటు డాక్టర్స్ డే వేడులకు ఆహ్వానించారు.

మటన్ షాప్‌లు..మసాజ్ సెంటర్లు..

- సుందరయ్య పార్కు చుట్టు అక్రమంగా వెలిసిన డబ్బాలు
- పట్టించుకోని అధికారులు.
- పానీపూరి బండ్లతో అధికారులకు అక్రమ ఆదాయం



పార్కు చుట్టు వెలిసిన అక్రమ డబ్బాలు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: నగరంలో ప్రతిష్టాత్మకమైన సుందరయ్య పార్కు చుట్టు ఉన్న ఫుట్‌పాత్‌పై అక్రమంగా డబ్బాలు వెలుస్తుండడంతో వాకర్లు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆహ్లాదం, ఆరోగ్యం కోసం వచ్చే వాకర్లు అక్రమ డబ్బాలను చూసి ముక్కున వేలేసుకుంటున్నారు. జీహెచ్‌ఎంసీ అధికారులకు మామూళ్లు అందుతున్నందునే వాటిని పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు ఈ అక్రమ వ్యాపారాలుపై దృష్టిసారించి వాటిని తొలగించి వాకర్స్‌కు ఆహ్లాదాన్ని అందించాలని కోరుతున్నారు.

రాకపోకలకు తీవ్ర ఇవబ్బందులు

పార్కు ముందు రహదారి ఇరుగ్గా ఉంటుంది. దీనికితోడు ఇరువైపుల డబ్బాలు వెలియడంతో రోడ్డు పూర్తిగా మూసుకుపోయింది. దీంతో ఈ మార్గంలో భారీ వాహనాలు వెళ్లేందుకు కష్టమవుతోంది. అక్రమ డబ్బాల వల్ల వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. పార్కు ఎదురుగా ఉన్న ఫుట్‌పాత్‌పై మటన్ షాపు, మసాజ్ సెంటర్, టీ కొట్టు, కొబ్బరి బొండాల షాపుల కారణంగా స్థానికులు అవస్థలు పడుతున్నారు.

అధికారులకు ఆదాయ వనరుగా..

సుందరయ్య పార్కు ప్రధాన గేటుకు ఆనుకుని గత కొన్నేళ్లుగా పానీపూరి బండిని నిర్వహిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ప్రతి నెల పానీపూరి బండి నుంచి జీహెచ్‌ఎంసీ అధికారులకు అక్రమంగా ఆదాయం అందుతుందనే ఆరోపణలు ఉన్నాయి.

సిగరెట్ పొగతో పరేషాన్...

సుందరయ్య పార్కులో ఫుట్‌పాత్‌కు ఆనుకు ఏడాది క్రితం సుమారు రూ.40 లక్షలతో ఓపెన్ జిమ్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. ఉదయం 5 గంటల నుంచే మహిళలు, వృద్ధులు జిమ్ సెంటర్‌కు వచ్చి వ్యాయామం చేస్తారు. అయితే పార్కు పక్కన ఉన్న డబ్బాల్లో కొందరు సిగరేట్లను కొని అక్కడే తాగుతుండటంతో పొగ కారణంగా వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.


పార్కు ఫుట్‌పాత్‌పై వెలిసిన మసాజ్ సెంటర్

జోరుగా అక్రమ వ్యాపారాలు



గత కొన్నేళ్లుగా పార్కు చుట్టు జోరుగా అక్రమంగా వ్యాపారాలు సాగుతున్నప్పటికి అధికారులు పట్టించుకోకపోవడం లేదు. ఫుట్‌పాత్ చుట్టు డబ్బాలు అక్రమంగా వెలిసి పార్కు ఆహ్లాదానికి భంగం కలిగిస్తున్నాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు పార్కు నుంచి వాహనాలు వెళ్లాలంటే ఇబ్బందిగా మారింది. అధికారుల అవినీతి, అలసత్వమే ఇందుకు కారణం.

– మన్నె దామోదర్‌రెడ్డి, పార్కు మాజీ అధ్యక్షుడు.

డబ్బాలను తొలగించండి



గత కొన్నేళ్లుగా పార్కు చుట్టు అక్రమంగా డబ్బాలు ఏర్పాటు చేసుకుని వాకర్స్‌కు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నారు. మటన్ షాపులు, మసాజ్ సెంటర్లు వెలిసినా అధికారులు చోద్యం చూస్తున్నారు. వెంటనే సంబంధిత అధికారులు స్పందించి అక్రమంగా వెలిసిన డబ్బాలను తొలగించి పార్కు ఆహ్లాదాన్ని పునరుద్ధరించాలని కోరుతున్నాం.

– బి.వెంకటస్వామిగౌడ్, పార్కు ప్రధాన కార్యదర్శి

సైబర్ సెక్యూరిటీ కోర్సుల్లో శిక్షణకు దరఖాస్తుల స్వీకరణ

కాచిగూడ: నేషనల్ అకాడమీ ఆఫ్ సైబర్ సెక్యూరిటీ ఆధ్వర్యంలో సైబర్ సెక్యూరిటీ కోర్సుల్లో శిక్షణకు రాష్ట్ర వ్యాప్తంగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ విమలా రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్, డిగ్రీ, పీజీ, ఇంజినీరింగ్, పాలిటెక్నిక్ తదితర కోర్సులు పూర్తి చేసిన ఆసక్తిగల అభ్యర్థులు ఆన్‌లైన్‌లో ఈనెల 19 లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. శిక్షణ అనంతరం కేంద్రప్రభుత్వ ఆమోదిత సర్టిఫికెట్స్‌ను అందజేస్తామన్నారు. వివరాలకు సెల్: 7893141797 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

ఓయూ ఉద్యోగులకు ఈఎస్‌ఐ, పీఎఫ్ సౌకర్యం

ఉస్మానియా యూనివర్సిటీ : ఓయూలో పనిచేస్తున్న 382 మంది ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఈఎస్‌ఐ, పీఎఫ్ సౌకర్యం లభించింది. గురువారం క్యాంపస్‌లోని లేడీస్ హాస్టల్ ఎదుట ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీఐటీయూ అనుబంధ ఓయూ కాంట్రాక్టు ఔట్‌సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు మహేందర్ ఈఎస్‌ఐ, పీఎఫ్ పత్రాలను అందజేశారు. ఈ సౌకర్యంతో ఉద్యోగులు వైద్యం, ఇతర సదుపాయాలతో పాటు అనేక రకాలుగా లబ్ధి పొందుతారని వివరించారు. ఓయూలో 30 ఏళ్ల నుంచి పనిచేస్తున్న వర్కర్ల కోసం సీఐటీయూ ఆధ్వర్యంలో పోరాడి ఈఎస్‌ఐ, పీఎఫ్ సౌకర్యాన్ని కల్పించినట్లు పేర్కొన్నారు. మూడేళ్ల నుంచి వేతనాలు పెంచడం లేదని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్దఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి ఆర్.సీతారాం, నాయకులు లక్ష్మీనర్సమ్మ, వెంకటమ్మ, రాణి పాల్గొన్నారు.


ఉద్యోగులకు పత్రాలను అందజేస్తున్న సీఐటీయూ నేత మహేందర్

సమష్టి కృషితోనే ప్లాస్టిక్ నియంత్రణ


పోస్టర్‌ను ప్రదర్శిస్తున్న రంగయ్య

కాచిగూడ: సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ను తరిమికొట్టేందుకు చేతులు కలపాలని ఎన్విరాన్‌మెంట్ ప్రొటెక్షన్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ అధ్యక్షుడు ఎస్‌సీహెచ్ రంగయ్య అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం ఆయన 'మేము సైతం' పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సమాజాన్ని తీవ్ర ఇబ్బందులకు గురిచేసే వస్తువు సింగిల్‌యూజ్ బ్యాగులను పూర్తిగా నిషేధించాలన్నారు. అనేక మంది మిగిలిన ఆహారపదార్థాలను ఈ ప్లాస్టిక్ సంచుల్లో ఉంచి పడవేయడం వల్ల మూగ జీవాలు తిని ప్రాణాలు కోల్పోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఆయా ప్లాస్టిక్ సంచుల్లో ఉండిపోయిన వ్యర్థాల కారణంగా పరిసరాలు దుర్గంధ మయంగా మారతాయని, నీటి వనరులు మనుగడ కోల్పోయే పరిస్థితులు నెలకొన్నాయన్నారు. దీనివల్ల ప్రకృతిలో జీవవైవిధ్యం దెబ్బతింటుందన్నారు. ప్లాస్టిక్ పై అవగాహన కల్పించేందుకు పాఠశాలలు, కళాశాల్లో పోస్టర్లను అంటిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం కూడా ప్లాస్టిక్ నియంత్రణకు చట్టాన్ని పటిష్టం చేయాలన్నారు.

ఘనంగా హెబ్రోన్ చర్చి వ్యవస్థాపకుడు భక్త సింగ్ జయంతి


వేడుకల్లో పాల్గొన్న ఆర్.వీరాచారి తదితరులు

చిక్కడపల్లి: గోల్కొండ చౌరస్తాలోని ప్రముఖ హెబ్రోన్ చర్చిలో గురువారం హెబ్రోను సొసైటీ వ్యవస్థాపకుడు భక్తసింగ్ 122 జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. సొసైటీ చైర్మన్ దైవ సేవకులు జోసఫ్ కురియన్ జన్మదినం కావడంతో ఆయన కేక్‌కట్ చేశారు. ఈ సందర్భంగా హెబ్రోను సొసైటీ అధికార ప్రతినిధి ఆర్.వీరాచారి మాట్లాడుతూ హెబ్రోన్ చర్చిని స్థాపించిన భక్తసింగ్ సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. వేడుకల్లో పాల్గొన్న ప్రముఖులకు, దూర ప్రాంతాలను నుండి వచ్చి వేడుకల్లో పాల్గొన్న వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

కులగణన ప్రక్రియను ప్రారంభించాలి


మాట్లాడుతున్న గుజ్జ సత్యం

కాచిగూడ: ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో వెంటనే కులగణన ప్రక్రియను ప్రారంభించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం అన్నారు. గురువారం ఆయన కాచిగూడలో విలేకరులతో మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల్లో బీసీలు కాంగ్రెస్ పక్షాన నిలిచి రాష్ట్రంలో 8 పార్లమెంట్ స్థానాలలో అత్యధిక మెజార్టీతో గెలిచేందకు కృషి చేశారన్నారు. బీసీ కులాల వారీగా జనాభా లెక్కలు తీసి రిజర్వేషన్లను 42శాతానికి పెంచిన తర్వాతే స్థానిక సంస్థ ఎన్నికలను నిర్వహించాలని సీఎం రేవంత్ రెడ్డిని కోరారు.

మహంకాళి ఆలయంలో రుద్రహోమం



రాంగోపాల్‌పేట్: సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి దేవాలయంలో గురువారం రుద్రహోమం నిర్వహించారు. అమావాస్య సందర్భంగా దేవాలయంలో నిర్వహించిన ఈ హోమంలో వేద పండితులు, అర్చకులతో పాటు భక్తులు పాల్గొన్నారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం భక్తులకు ప్రసాదవితరణ చేశారు.

ప్రభుత్వ పాఠశాలలో ఉత్తమ బోధన

రాంగోపాల్‌పేట్ : ప్రభుత్వ పాఠశాలల్లో అర్హత, అనుభవం ఉన్న ఉపాధ్యాయులతో నాణ్యమైన విద్యాబోధన చేయిస్తున్నామని విద్యాశాఖ కమిషనర్ దేవసేన అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా గురువారం నల్లగుట్టలోని ప్రభుత్వ పాఠశాలలో ఆర్జేడీ విజయలక్ష్మి, డీఈఓ రోషిణి తదితర అధికారులతో కలిసి ఆమె విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో మాట్లాడారు. ప్రైవేటు పాఠశాలల్లో అర్హత కలిగిన ఉపాధ్యాయులు తక్కువ అని అనవసరంగా ఫీజుల రూపంలో డబ్బు పోగొట్టుకోకుండా ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించాలని ఆమె తల్లిదండ్రులకు సూచించారు. అమ్మ ఆదర్శ పాఠశాల కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలలో మూత్రశాలలు, తాగు నీళ్లు, విద్యుత్ తదితర పనులను చేయించి మంచి సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. కొంత మంది తల్లిదండ్రులతో మాట్లాడుతూ.. ప్రైవేటు పాఠశాలల నుంచి ఎందుకు ప్రభుత్వ పాఠశాలల్లోకి పిల్లలను తీసుకొచ్చారని ప్రశ్నించగా.. ప్రైవేటులో ఫీజులు ఎక్కువగా ఉండటంతో ఇక్కడ చేర్పిస్తున్నామన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఇప్పుడు బోధన కూడా నచ్చిందని తల్లిదండ్రులు సమాధానం ఇచ్చారు. కొంతమంది విద్యార్థులతో మాట్లాడి వివిధ ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. బడిబాటలో భాగంగా ఇంటింటికి తిరిగి విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్ పెంచాలని సూచించారు. డిప్యూటీ ఐవోఎస్ సుమన్, డిప్యూటీ ఈవో శ్రీధర్, హైస్కూల్ హెచ్‌ఎం స్వరూప తదితరులు పాల్గొన్నారు.

రైల్వే పెన్షనర్లకు మెరుగైన సేవలు

రాంగోపాల్‌పేట్: రైల్వే పెన్షనర్లకు మెరుగైన సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఎస్‌బీఐ సీనియర్ మేనేజర్ శశి కుమార్ తెలిపారు. రెజిమెంటల్‌బజార్‌లోని ఎస్‌బీఐ హిమ్మత్‌నగర్ శాఖలో రైల్వే పెన్షనర్లకు వైద్యపరీక్షలు నిర్వహించి శాలువ, బొకేతో సత్కరించారు. ఈ సందర్భంగా మేనేజర్ మాట్లాడుతూ.. పెన్షనర్ల సమస్యలు తన దృష్టికి తీసుకొస్తే వెంటనే వాటిని పరిష్కరిస్తామన్నారు. పెన్షనర్ అసోసియేషన్ ప్రతినిధులు బీకేసింగ్, విద్యాసాగర్, నాగేశ్వరరావు, రాఘవేంద్రరావు తదితరులున్నారు.

దంచికొట్టి... రోడ్లన్నీ ముంచి..






కవాడిగూడలో గురువారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి రోడ్లన్నీ గోదారులను తలపించాయి. దీంతో ట్రాఫిక్ స్తంభించింది. దాదాపు గంట పాటు ఉరుములు, మెరుపులతో కూడిన వర్షంతో ప్రజలకు అవస్థలు పడ్డారు. కవాడిగూడ, దోమలగూడ, గగన్‌మహల్, ఇందిరాపార్కు, లోయర్ ట్యాంక్‌బండ్ తదితర ప్రాంతాలలో రోడ్లపై వర్షపు నీరు నిలిచిపోవడంతో వాహన దారులు ఇబ్బందులు పడ్డారు. పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. లోతట్టు ప్రాంతాల్లోకి నీరు చేరడంతోపాటు డ్రైనేజీలు పొంగిపొర్లాయి – కవాడిగూడ